12లోగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

వీసీలో పాల్గొన్న కలెక్టర్, పీవో, డీఎఫ్‌వో, అదనపు కలెక్టర్లు

ములుగురూరల్, జూలై 9 : ఉద్యోగ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేసిందని, బదిలీల కోసం ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై వీసీ నిర్వహించగా ములుగు నుంచి కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం నాలుగేండ్లు ఒకేచోట పనిచేసిన సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని, అదే సమయంలో రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శాఖల పరిధిలోని ఖాళీల తుది జాబితాను రూపొందించి ఉద్యోగస్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో బదిలీలు ఉంటాయని, ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీసీవో సర్దార్ సింగ్, డీఏవో విజయచంద్ర, డీఈవో పాణిని, డీఐవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులను వినియోగించాలి

భూపాలపల్లి రూరల్, జూలై 9 : పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులను వినియోగించాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం జీఎం కార్యాలయంలో ఎన్విరాన్‌మెంట్ అధికారి పోషమల్లు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా జీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి నార సంచులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గుడ్డ సంచులను వాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. నిత్యావసర సరుకుల కొనుగోలుకు తమ వెంట జ్యూట్ బ్యాగులు తీసుకెళ్లాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు అందించాలని జీఎం అన్నారు. కార్యక్రమంలో ఏజీఎం జ్యోతి, డీజీఎం అజ్మీరా తుకారాం, ఎస్ఈ శ్రీనివాస్, డీవై పీఎంలు రాజు, క్రాంతికుమార్, శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

వాజేడు, జూలై 9 : మండలంలోని పేరూరులో మంగళవారం కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఆర్థిక అక్షరాశ్యత కో ఆర్డినేటర్ మాధురి హాజరై వందరోజుల జాబ్‌కార్డు కావాల్సిన వారు ఎంపీడీవో ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాశ్యత కో ఆర్డినేటర్ మాధురి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణంతో పాటు 10 లక్షల ఇన్సూరెన్స్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్ష బీమా యోజన, లేబర్ ఇన్స్యూరెన్స్ అటల్ పింఛన్ యోజనపై అవగాహన కల్పించారు. కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ కామేశ్, ప్రసాద్, భాస్కర్, రమాదేవి, స్వరూప పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

మంగపేట, జూలై 9 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వీరాస్వామి, ఎంపీడీవో కృష్ణప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైద్య, ఇరిగేషన్, పంచాయతీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గోదావరి పరివాహక గ్రామాల్లో వర్షపాతం పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో తీర ప్రాంత అధికారులు, సిబ్బంది వృద్ధులు, గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో వైద్యులు నిఖిల్, యమున, వైశాలి, ఇరిగేషన్ ఏఈలు వలీమహ్మద్, బుచ్చినర్సయ్య, జూనియర్ అసిస్టెంట్ సఫియా, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సీతక్క పుట్టిన రోజు వేడుకలు

కన్నాయిగూడెం: సైకిళ్లతో విద్యార్థినులు, నాయకులు

ములుగురూరల్/కన్నాయిగూడెం, జూలై 9: మండలకేంద్రంలో మంత్రి సీతక్క పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అప్సర్ పాషా, ఇన్‌చార్జి రాంబాబు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కాగా, మంత్రి సీతక్క తన పుట్టినరోజు సందర్భంగా మండలంలోని కస్తూర్బా గాంధీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10వ తరగతి పరీక్షలో మండల టాపర్‌గా రాణించిన నలుగురు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. రాజబాబు, రమేశ్, భాస్కర్, రాజేందర్ పాల్గొన్నారు. అలాగే ములుగు ప్రభుత్వ దవాఖానలో ఆదివాసీ ఉద్యోగులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, జిల్లా అధ్యక్షుడు రవి, ఉద్యోగ సంఘం నాయకులు సాంబయ్య, వెంకట్, రవీందర్, శివరాజ్, చంటి, కిశోర్, కుమార్, బాబు, సాంబయ్య, శ్రీకాంత్, సుకుమార్, దవాఖాన సూపరింటెండెంట్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మో హన్‌లాల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సతీశ్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ములుగురూరల్, జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం కోరారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీల పేరు తో కాలయాపన చేయకుండా, ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షల రుణమా ఫీ చేయడంతో పాటు రైతు భరోసా అమలు చేయాలన్నారు. కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు బాబు, నాయకులు కృష్ణాకర్, రవీంద్రాచారి, మహేందర్, రవిరెడ్డి, కుమార్, హేమాద్రి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కాటారం, జూలై 9 : ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. గారెపల్లి శివారులోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి సాగు చేస్తున్నారని పలువురు తహసీల్దార్ నాగరాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ వెంకన్న మంగళవారం సిబ్బందితో వెళ్లి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పనులు, పురోగతిపై సమీక్ష

మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్, పక్కన కలెక్టర్, ఎస్పీ

భూపాలపల్లి రూరల్, జూలై 9 : అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూపాలపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పనులు, పురోగతి, పూర్తయిన భవనాలు, నిధుల మంజూరు తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే జీఎస్ఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు చేయకుండా చెల్లించిన ప్రభుత్వ సొమ్ము రికవరీకి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని, ఇందుకు ప్రతిపాదనలు, వివరాలు తనకు ఇస్తే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. గత సంవత్సరం వరదలకు 124 చెరువులు దెబ్బతిని పంట సాగుకు అనుకూలత లేకుండా పోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేశారని, ప్రాధాన్యతను గమనించి పనులు పూర్తి చేయాలన్నారు. టెండర్ దక్కించుకుని పనులు చేపట్టని కాంట్రాక్టర్లకు 60సి ద్వారా నోటీస్ జారీ చేసి రద్దు చేయడంతో పాటు చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుద్దారం నుంచి కోటంచ వరకు రహదారి నిర్మాణానికి రూ.59 కోట్లు, కోటంచ ఆలయ అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవతో రూ.12 కోట్లు మంజూ రు చేసినట్లు తెలిపారు. సమీక్షించిన అంశాలపై వచ్చే నెల 9న మళ్లీ సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. టేకుమట్ల–రాఘవరెడ్డిపేట మధ్య మానేరు వాగుపై నిర్మిస్తున్న వంతెనను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని, రామప్ప చెరువు నుంచి వంగపల్లి చెరువు మీదుగా గణపసముద్రంలోకి నీటి సరఫరాకు గ్రావిటీ కెనాల్ నిర్మాణానికి భూ సేకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే నియోజకవర్గంలోని 500 ఎకరాలకు పైబడి సాగయ్యే చెరువులకు తైబందీ చేయాలన్నారు. ఒడితల, నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్‌లో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు క్షేత్ర స్థాయిలో ప్రతి విషయంపై అవగాహన ఉండాలని, కింది స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి : కలెక్టర్

జిల్లాలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ ఎకో పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్‌ఖరేతో పాటు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పార్కులో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లాగా ప్రభుత్వం జయశంకర్ భూపాలపల్లిని గుర్తించిందన్నారు. వన మహోత్సవంలో భాగంగా రహదారులు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో కనీసం మూడు నుంచి ఐదు మొక్కలు తప్పకుండా నాటాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అటవీ శాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో వసంత, జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో మంత్రి సీతక్క

గొత్తికోయగూడెంలో పాఠశాల భవనం ప్రారంభం

తాడ్వాయి , జూలై 9: మండలంలోని నార్లాపురం గ్రామ సమీపంలోని తక్కళ్లగూడెం గొత్తికోయగూడెంలో పాఠశాల భవనాన్ని మంత్రి సీత క్క మంగళవారం ప్రారభించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన దాతల సహకారంతో నిధులు సేకరించి ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన వారి పిల్లలకు చదువు నేర్పించేందుకు భవనాన్ని నిర్మించారు. దాతల సహకారంతో ఎస్పీ శబరీష్, తాడ్వాయి పోలీసులు భవన నిర్మాణాన్ని 15 రోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. గొత్తికోయలకు విద్య అందించేందు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాఠశాల భవనాన్ని నిర్మించగా, మంగళవారం ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ యూనిఫాం అందజేశారు. తక్కువ సమయంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చిన పస్రా సీఐ రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, చక్రవర్తి దవాఖాన వరంగల్ యజమాని తరుణ్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

బొగత వద్ద పర్యాటకులు అప్రమత్తంగాఉండాలి

వాజేడు, జూలై 9 : మండలంలోని చీకుపల్లి అటవీప్రాంతంలోని బొగత జలపాతాన్ని వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై హరీశ్‌తో కలిసి సందర్శించారు. దీనిలో భాగంగా జలపాతంను చూసేందుకు వచ్చిన పర్యాటకులతో సీఐ మాట్లాడారు. నీళ్లలో లోతుకు వెళ్లకుండా ఉండాలని ప్రమాదాల భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

భూపాలపల్లి రూరల్, జూలై 9: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. మంగళవారం వన మహోత్సవం, మహిళా శక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ధరణి, సిబ్బంది బదిలీలు తదితర అంశాలపై వీసీ నిర్వహించారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. అనంతరం అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, వైద్య, విద్య, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 26 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు 3.70 లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. ఎనిమిది ప్రాంతాల్లో సంపద వనాలు నాటేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహిళా శక్తిపై జిల్లా, మండల సమాఖ్యలతో సమావేశం ఏర్పాటు చేయాలని డీఆర్డీవోకు కలెక్టర్ సూచించారు. 11 మండలాలతో పాటు మున్సిపాలిటీలో ప్రజాపాలన సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశామని, జిల్లాలో 85 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని, ఇప్పటి వరకు 11 వేల ఎకరాలు క్రాప్ బుకింగ్ చేశాని తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని, 25 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఎరువుల కోసం ఎదురుచూడకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సిబ్బంది బదిలీల వివరాలు అందజేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, డీపీవో నారాయణరావు, వ్య వసాయ అధికారి విజయభాస్కర్, డీఈవో రాజేందర్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావు, ఆర్డీవో మంగీలాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్, ఎన్‌వీబీడీసీ, ఐసీడీపీ, బ్లడ్ బ్యాంక్ ప్రోగ్రాం అధికారి రవీందర్ సూచించారు. మంగళవారం మండలంలోని పాలంపేటను ఆయన సందర్శించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వెంకటాపూర్ పీహెచ్‌సీని పరిశీలించారు. వైద్యులు శ్రీకాంత్, భవ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'సంపద వనాల' ఆర్చి గేట్ 'నమస్తే'ఎఫెక్ట్

మహదేవపూర్, జూలై 9 : మండలంలోని సూరారంలో మేడిగడ్డ బరాజ్ సమీపంలో ఈదురు గాలుల కారణంగా రోడ్డుపై ప్రమాదకరంగా వంగి ఉన్న సంపద వనాల ఆర్చి గేట్‌ను అధికారులు సరిచేయించారు. ఈ నెల 7న 'ప్రమాదకరంగా సంపద వనాల' ఆర్చి గేట్ కథనం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవగా అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదేశాలతో సూరారం జీపీ కార్యదర్శి అంజలిరెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు ఆర్చి గేట్‌ను సరిచేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



శివరామకృష్ణ (ఫైల్)

చిట్యాల, జూలై 9 : భార్య విడాకుల నోటీస్ పంపడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. చల్లగరిగె గ్రామానికి చెందిన పినగాని శివరామకృష్ణ(34) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య ఆయనకు విడాకుల నోటీస్ పంపించింది. ఈ నెల 10న బుధవారం విడాకుల కేసులో కోర్టు హియరింగ్ ఉండనుంది. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 8న రాత్రి రోజు వారీగా వేసుకునే మాత్రలను అధిక మొత్తంలో వేసుకున్నాడు. అపస్మారస్థితిలోకి వెళ్లిన శివరామకృష్ణను కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

'ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలి'

మహదేవపూర్, జూలై 9 : మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీపాదరావు విగ్రహ ఏర్పాటుకు అనుమతిచ్చిన ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, కాటారం ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకుడు వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు ఎండీ అలీం ఖాన్ మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజలను చైతన్యం చేయడానికి ప్రజాప్రతినిధులు ఆదర్శంగా పనిచేయడానికి ప్రభుత్వ కార్యాలయాల్లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని, కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. పరిపాలనా కేంద్రమైన మండల పరిషత్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా శ్రీపాదరావు విగ్రహ ఏర్పాటుకు అనుమతించిన ఎంపీడీవోపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దాని స్థానంలో అంబేద్కర్ విగ్రహన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

స్త్రీ నిధి రుణాల్లో అవకతవకలపై సభ్యుల ఫిర్యాదు

ఏటూరునాగారం, జూలై 9 : మండలంలోని రొయ్యూరుకు చెందిన వీవోఏ స్త్రీ నిధి రుణాల్లో అవకతవకలకు పాల్పడి, ఫోర్జరీ సంతకాలతో సభ్యులకు తెలియకుండా డబ్బులు తీసుకుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన గ్రామైక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పద్మావతి, భూలక్ష్మి, జయమ్మ, అనుము లక్ష్మి, మల్లక్క, సరిత, స్వప్న, రజిత, గంగ, పుష్ప తదితరులు మంగళవారం మండల సమైక్య కార్యాలయ అకౌంటెంట్ శ్రీనుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 22న 30 గ్రూపులకు చెందిన కొందరు సభ్యులకు సంబంధించి వారికి తెలియకుండా రూ. లక్షల డ్రా చేసినట్లు ఆరోపించారు. ఈ విషయం తాజాగా వెలుగు చూసిందని వారు ఆరోపించారు. వచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏపీవో తెలిపారు.

వరద సమయంలో గర్భిణుల తరలింపుపై చొరవ చూపాలి

ఏటూరునాగారం, జూలై 9 : వరద ముంపు గ్రామాల్లో వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు ముందుగానే సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ మేరకు మంగళవారం వరద ముంపు గ్రామాల్లో ముందస్తు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల్లో గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధుల వివరాలు సేకరించాలన్నారు. వరదలు వస్తే వెంటనే వారిని సురక్షిత ప్రాంతానికి తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జగదీశ్, పంచాయతీ రాజ్ ఏఈఈ భిక్షపతి, నీటి పారుదలశాఖ ఏఈఈ రమేశ్, ఎంపీవో కుమార్, మెడికల్ ఆఫీసర్లు రోహిత్, సుమలత, అభివన్, సీడీపీవో హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి అంగన్‌వాడీల వినతి

ములుగురూరల్, జూలై 9 : అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి సీతక్కకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబందించిన బిల్లు ఆర్థిక శాఖ మంత్రి వద్ద అప్రువల్ అవుతుందని, అంగన్‌వాడీలకు రూ. 2 లక్షలు, ఆయాలకు లక్ష రిటైర్మెంట్ సమయంలో అందించనున్నట్లు తెలిపారు. అనంతరం దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీల వద్దకు డీడబ్ల్యూవో స్వర్ణలతాలెనినా, సీడీపీవోలు హేమలత, ముత్తమ్మ, శిరీష చేరుకొని దీక్షను విరమించాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మెమో నంబర్ 1334ను ఉపసంహరించుకొని కొత్త జీవో వచ్చే వరకు దీక్షలను కొనసాగిస్తామని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కంటెయినర్ సబ్‌సెంటర్ ఏర్పాటు..

తాడ్వాయి, జూలై 9 : కొడిశల పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వినూత్నంగా కంటెయినర్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య మాట్లాడుతూ మండలానికి చెందిన పోచాపూర్ గ్రామం చుట్టు పక్కల గ్రామాలైన నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాలు పస్రా గ్రామం నుంచి సుమారు 40కిలో మీటర్ల దూరంలో ఉంటాయన్నారు. వీరంతా ప్రతి మంగళవారం పస్రాలో జరిగే అంగడికి వచ్చి వారికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి ఆరోగ్య సమస్యలు తలెత్తిన ప్రజలు పస్రా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ వెళ్తుంటారన్నారు. వారానికి ఒక్క రోజు మాత్రమే వీరంతా సొంత వాహనాలను సమకూర్చుకొని పస్రాకు వస్తుంటారని, ఆరోగ్య సమస్యలు తలెత్తినా వారం వరకు వేచి చూసే పరిస్థితి నెలకొని ఉంటుందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సరైన భవనం లేకపోవడంతో కలెక్టర్ డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.7లక్షలను మంజూరీ చేయ గా, వాటితో కంటైనర్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, నాలుగు బెడ్లతో పాటు ప్రాథమిక చికిత్సను అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేశామని తెలిపారు.

మేడిగడ్డకు భారీగా వరద

ఇన్‌ఫ్లో/అవుట్‌ఫ్లో 35,200 క్యూసెక్కులు

మహదేవపూర్, జూలై 9 : లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌కు భారీగా వరద ప్రవాహం వస్తున్నది. 16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న బరాజ్‌కు సోమవారం ఇన్‌ఫ్లో 20, 260 క్యూసెక్కులు రాగా, మంగళవారం బరాజ్ ఇన్‌ఫ్లో 35,200 క్యూసెక్కులకు పెరిగింది. మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ రివర్ బెడ్ లెవల్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా, 89.60 మీటర్ల ఎత్తులో వరద ప్రవహిస్తున్నది.

తుపాలకులగూడెం వద్ద పెరుగుతున్న గోదావరి

కన్నాయిగూడెం: మండలంలోని సమ్మక్క బరాజ్ (తుపాకులగూడెం)వద్ద గోదావరి నది ప్రవాహం పెరుగుతోంది. మంగళవారం ఎగువ నుంచి 53,720 క్యూ సెక్కుల వరద వస్తుండడంతో బరాజ్ 52 గేట్లను ఎత్తి అంతేమొత్తంలో దిగువకు వదులుతున్నట్లు నీటిపారు దలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బరాజ్ దగ్గర 73 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తున్నది. అలాగే మంగళవారం మండలవ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. దీంతో కుంటలు, పంట పొలాలు నిండి పారుతున్నాయి. గ్రామాల్లో ఓ మాదిరిగా కురవగా బుట్టాయిగూడెం, ముప్పనపల్లి, గూర్రేవుల, చిట్యాల, భూపతిపురంతో పాటు పలు గ్రామాల్లో భారీగా కురిసింది.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై హరీశ్

అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, జూలై 9 : వరదలపై అప్రమత్తంగా ఉండాలి ఎస్సై హరీశ్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. మంగళవారం వరద ముంపు గ్రామాలైన దూలపురం, సుందరయ్యకాలనీ గ్రామాలను పరిశీలించారు. అదే విధంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని మండల అధికారులతో ఎంపీడీవో విజయ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాస్, కార్యదర్శులు ప్రభాకర్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

వెంకటాపురం (నూగూరు), జూలై 9 : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలోని సీనియర్ యూడీసీ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. నాయకులు సతీష్, రఘురాం, విజయ్‌కుమార్, రాజు, చక్రపాణి, తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ములుగురూరల్, జూలై 9 : మండలంలోని మాన్‌సింగ్‌తండాకు చెందిన విద్యార్థిని నునావత్ అనూషకు అదే గ్రామానికి చెందిన బానోత్ రవీందర్ (శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మేనేజర్) రూ. 52 వేలు మంగళవారం గ్రామానికి వచ్చి ఆర్థికసాయం అందజేశారు. 12 ఏండ్ల క్రితం తండ్రి, పదేళ్ల క్రితం తల్లి అనారోగ్యంతో మృతి చెందగా, అనూష అనాథగా మిగిలింది. బాలిక పెద్దనాన్న వద్ద ఉంటూ పదో తరగతి పూర్తి చేసి, ఉత్తీర్ణత సాధించింది. అనంతరం ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో చేరి మొదటి సంవత్సరం పూర్తి చేయగా, ద్వితీయ సంవత్సరంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న రవీందర్ సాయం చేసేందుకు ముందుకు రావడంతో పాటు అతను విధులు నిర్వర్తించే చోట తోటి ఉద్యోగులకు విషయాన్ని తెలుపగా వారు కొంత సాయం చేయగా, అనూషకు రూ.52 వేలు అందించాడు. దీంతో పాటు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సౌకర్యార్థం రూ. 5 వేలు అందజేశారు. రవీందర్‌ను గ్రామస్తులు అభినందించారు.

గురుకులాలకు టెండర్లు ఖరారు

ఏటూరునాగారం, జూలై 9 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలకు కూరగాయాలు, మటన్, చికెన్, కోడిగుడ్లు సరఫరా కోసం ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం టెండర్లు నిర్వహించారు. వ్యాపారులు వేసిన టెండర్లను ఓపెన్ చేసి, సరఫరా కోసం ఆదేశాలు జారీ చేసినా ఒప్పందం కుదుర్చుకున్నారు. టెండర్లు పొందిన వారు సకాలంలో సరఫరా చేయాలని ఏపీవో వసంతరావు సూచించారు. టెండర్ల కేటాయింపులో ఆర్సీవో రాజ్యలక్ష్మి, డీడీ పోచం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కొడవటంచ బీటీ రోడ్డు పనులు ప్రారంభం

చిట్యాల, జూలై 9 : మండలంలోని చల్లగరిగె నుంచి రేగొండ మండలం కొడవటంచ ప్రధాన రోడ్డు వరకు 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జీఎస్ఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, కార్యదర్శి చిలుకల రాయకొమురు పనులను ప్రారంభించారు. సుమారు రూ1.70 కోట్లతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జం వేణు, దేవేందర్, మేకల శ్రీనివాస్, ఆకుల సుధాకర్, మూల రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

తాడిచర్ల పాఠశాలలో వన మహోత్సవం

మల్హర్, జూలై 9 : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని తాడిచర్ల పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్క భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఇంటి వద్ద మొక్క నాటాలన్నారు. ఉపాధ్యాయులు కుమారస్వామి, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

ములుగురూరల్, జూలై 9 : విదేశాల్లో ఉన్నత చదువులు చదివే వారు ప్రభుత్వం కల్పించే సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత పత్రాన్ని అగస్ట్ 7లోగా అందజేయాలని సూచించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



సర్దామ్‌హుస్సేన్(ఫైల్)

గోవిందరావుపేట, జూలై 9 : మండలంలోని పస్రా గ్రామానికి చెందిన ఎస్కే సర్దామ్‌హుస్సేన్(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఎస్కే ఉమర్–ఆశ దంపతుల కుమారుడు సర్దామ్‌హుస్సేన్ సోమవారం రాత్రి తనకు డబ్బులు కావాలని తల్లిని కోరగా నాన్న లేడు, వచ్చినంక అడిగి ఇస్తానని చెప్పింది. రాత్రి 9గంటల సమయంలో ఇంట్లోని గదిలోకి వెళ్లి మంగళవారం ఉదయం 9గంటలైనా బయటకు రావడంతో తలుపులు పగలగొట్టి చూడగా ఉరేసుకొని కనిపించాడు. తల్లి ఆశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు మద్యం, చెడు అలవాట్లతో తిరిగేవాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏటూరునాగారం, జూలై 9 : మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి కింద పడి తురక లక్ష్మణ్ (19) విద్యార్థి మృతి చెందినట్లు ఎస్సై తాజుద్దీన్ మంగళవారం తెలిపారు.మంగపేట మండలం కమలాపురానికి చెందిన లక్ష్మణ్, తన బాబాయి బీ ఉప్పలయ్యతో కలిసి బైక్‌పై భూపాలపల్లి వెళ్లి వస్తుండగా, సోమవారం రాత్రి చిన్నబోయినపల్లి సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. దీంతో లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పలయ్యకు గాయాలవడంతో దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడి తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన ఎలక్ట్రీషియన్..

గణపురం, జూలై 9: మండలంలోని లక్ష్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ రెడ్డి రాజిరెడ్డి (42) మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. గత శుక్రవారం విద్యుత్ షాక్‌తో కరెంటు స్తంభం పైనుంచి కింద పడడంతో రాజిరెడ్డికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం

కృష్ణకాలనీ, జూలై 9 : నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని వాహనాలు నడిపితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేటీకే–5 ఇంక్లైన్ కమాన్ వద్ద జాతీయ ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, నంబరు ప్లేట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలకు పత్రాలు, వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు.